క్లుప్తంగా

విద్యార్థులకు బ్యాగులు, యూనిఫాం అందజేత



విద్యార్థులకు బ్యాగులు, యూనిఫాం అందజేస్తున్న వైస్ ఎంపీపీ కొపనాతి లలిత

తాళ్లరేవు: మండల పరిధిలోని కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు వైస్ ఎంపీపీ కొపనాతి లలిత బ్యాగులు, యూనిఫాంను అందజేశారు. గురువారం స్కూల్ హెచ్ఎం కేఆర్‌కే సాయిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లలిత మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని సమాజంలో ఉన్నత వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వాడ్రేవు వీరబాబు, సంగాడి శ్రీను తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తాళ్లరేవు మాధవరాయునిపేట ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రెడ్డి రెడ్డిబాబు, నందికోళ్ల శ్రీమన్నారాయణ తదితరులు చిన్నారులకు బ్యాగులు, యూనిఫాం అందజేశారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

తాళ్లరేవు: మహిళలు, బాలలకు రక్షణ కల్పించే చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ వి.మాధవి అన్నారు. గురువారం పలు పాఠశాలల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. గాడిమొగ పంచాయతీ లక్ష్మీపతిపురం, గాడిమొగ, నీలపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో గృహహింస, బాల్య వివాహ నిరోధక చట్టం, పోక్సో చట్టాలపై ఐసీడీఎస్ ఈఓ ఎంఎస్ నళిని, మాణిక్యాంబ తదితరులు వివరించారు. ఎవరైనా బాల్య వివాహాలు జరిపిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, హెచ్ఎంలు ఆర్.విజయలక్ష్మి, సునీత, రాధాకృష్ణ, సీతారత్నం, గంగాభవాని పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: యానాం నవోదయ విద్యాలయలో 6వ తరగతిలో ప్రవేశానికి వచ్చే ఏడాది జనవరి 18వ తేదీన నిర్వహించే ఎంట్రన్స్ టెస్టుకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యానాంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రులు యానాం నివాసితులై ఉండాలన్నారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మెరిట్ ప్రాతిపదికన ఎంపిక ఉంటుందని, దరఖాస్తుల స్వీకరణకు సెప్టెంబర్ 16ను ఆఖరు తేదీగా నిర్ణయించామన్నారు.

పుదుచ్చేరి డీజీపీగా షాలినీసింగ్



యానాం: పుదుచ్చేరి డీజీపీగా ఐపీఎస్ అధికారి షాలినీసింగ్‌ను నియమిస్తూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ డైరెక్టర్ బీజీ కృష్ణన్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఆమె నియామకం ఆగస్టు 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. ఏజీఎంయూటీ 1996 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన షాలినీ సింగ్ ప్రస్తుతం ఢిల్లీ పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తున్నారు.

విద్యతోనే ఉన్నతి

ఉప్పలగుప్తం: విద్యతోనే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోగలమని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అన్నారు. గురువారం ఆయన మండలంలోని భీమనపల్లి, గొల్లవిల్లి, చల్లపల్లి, గోపవరం, మునిపల్లి, ఎస్.కొత్తపల్లి పాఠశాలల్లో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు యర్రంశెట్టి రామచంద్రరావు, జొన్నాడ శ్రీదుర్గ, కుంచే బుల్లియ్య, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, చీకట్ల ఏసు, సలాది నాగరాజు, గనిశెట్టి అరవింద్, ఇసుకపట్ల రఘుబాబు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ముమ్మిడివరం: స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. మండలంలోని టౌన్ ఫీడర్, 1, 2, ఠానేల్లంక, అయినాపురం, కొత్తలంక, అనాతవరం పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందన్నారు.

నిత్యావసరాల అందజేత

అమలాపురం రూరల్: మండలంలోని సాకుర్రు గ్రామానికి చెందిన నూకల వెంకట్ పుట్టుకతోనే మానసిక వికలాంగుడు. అతడి తండ్రి చనిపోవడంతో తల్లి నూకల దుర్గ కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. విషయం తెలుసుకున్న ఫ్రీ టైమ్ సర్వీస్ ఫౌండేషన్ అధ్యక్షుడు తులా రాంబాబు బాధిత కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరకులు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నాళం శివ, పప్పుల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఖర్చు సగమే.. పని రెండింతలు

- కోనసీమలో హవా చాటుతున్న బెంగాలీ కూలీలు
- సాగు ఖర్చులు తగ్గించుకునేందుకు వారి వైపే రైతుల మొగ్గు
- సమయం, పెట్టుబడి ఆదా అవుతున్నాయంటున్న అన్నదాతలు



గొల్లవిల్లిలో నాట్లు నాటుతున్న వలస కూలీలు

ఉప్పలగుప్తం: గోదావరి డెల్టా ప్రాంతంలో అత్యధిక శాతం మంది వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నారు. అయితే ఏటికేడు పెరుగుతున్న ఖర్చులు చూసి సాగు చేయాలంటే అన్నదాతలు భయపడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఇంటికి చేరే వరకూ ఏం జరుగుతుందోనన్న బెంగ రైతులకు తప్పడం లేదు. మరోవైపు వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే సమయంలో స్థానికంగా కూలీల కొరత ఏర్పడి కూలి రేట్లు ఒక్కసారిగా పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో బెంగాల్ నుంచి వస్తున్న వలస కూలీలతో పనులు చేయించుకోవడానికి అన్నదాతలు ప్రాధాన్యమిస్తున్నారు. పైగా బెంగాల్ కూలీలు సగం ఖర్చుతోనే రెండింతల పని చేస్తున్నారంటూ స్థానిక రైతులు కితాబిస్తున్నారు.

అమలాపురం నియోజకవర్గంలోని అమలాపురం, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల్లో సుమారు 13,200 ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టగా ఇప్పటివరకూ 21 శాతం నాట్లు మాత్రమే పూర్తయ్యాయి. ముమ్మిడివరం నియోజకవర్గంలో దాదాపు 32,000 ఎకరాల్లో వరి సాగు జరుగుతుండగా 70 శాతం నాట్లు పూర్తయ్యాయి. కొన్నేళ్ల క్రితం వరకూ రైతులంతా తమ వ్యవసాయ పనుల్లో ఒకరికొకరికి సహకరించుకునేవారు. తదనంతర కాలంలో కూలీలతో పనులు చేయించుకునేవారు. అయితే ఏటికేడు ఎరువులు, పురుగుమందుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. రైతులకు గతంలో ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.18 వేలు పెట్టుబడి అయ్యేది. కానీ ఇప్పుడు ఎరువులు, పురుగు మందులు, కూలీ రేట్లు పెరగడం వల్ల రూ.25 వేల నుంచి రూ.27 వేల వరకూ పెట్టుబడికే ఖర్చవుతుంది. మరోవైపు సరిగ్గా ఖరీఫ్, రబీ పనుల సమయంలో ఆకుతీత, నాట్లు వేయడానికి కూలి రేట్లు ఆకాశాన్నంటడమే కాకుండా సమయానికి కూలీలు దొరకడం లేదు. దీంతో గత కొన్నేళ్లుగా అమలాపురం, అల్లవరం, తాళ్లరేవు, ఐ.పోలవరం, ఉప్పలగుప్తం తదితర మండలాల రైతులంతా బెంగాలీ కూలీల వైపు మొగ్గు చూపిస్తున్నారు. పశ్చిమ బెంగాల్ నుంచి వస్తున్న వలస కూలీల పనిలో వేగం, నాట్లు వేయడంలో విభిన్న పద్ధతి వల్ల ఖర్చు సగానికి సగం తగ్గిపోతుండడంతో రైతులంతా వారికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

మొగ్గుకు ప్రధాన కారణాలివే

- స్థానిక కూలీలు ఎకరానికి 13 నుంచి 15 మంది ఆడవారు, నలుగురు మగవాళ్లు నాట్లు వేయడానికి, నారు తీయడానికి అవసరమవుతున్నారు. వీరికి ఎకరానికి రూ.7,500 నుండి 8,000 వరకూ కూలిగా రైతులు చెల్లిస్తున్నారు. అయినా స్థానిక కూలీలు రోజుకు ఎకరం నుంచి ఎకరంన్నర మాత్రమే నాట్లు వేస్తారు.
- అదే వలస కూలీలైతే 10 నుంచి 12 మంది ఒక జట్టుగా ఏర్పడి తెల్లవారుజామున 5 గంటలకే పని ప్రారంభించి రోజుకు ఐదారు ఎకరాల్లో నారు తీసి నాట్లు వేస్తున్నారు. వీరికి అయ్యే ఖర్చు ఎకరానికి రూ.4,000 మాత్రమే.
- స్థానిక వ్యవసాయ కూలీల కన్నా బెంగాలీల వరినాట్లు భిన్నంగా ఉంటాయి. పైగా వేగంగా పని చేయడంతో పాటు సమదూరంలో నాట్లు వేయడం వల్ల నారు ఆదా అవుతుంది. దీనివల్ల ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడులు సైతం ఆశాజనకంగా వస్తున్నాయని రైతులు చెబుతున్నారు.
- స్థానిక కూలీలు ఎకరానికి 40 పోగులకు పైగా నారు వినియోగిస్తుంటే బెంగాలీ కూలీలు మాత్రం ఎకరానికి 15 నుంచి 20 పోగుల నారుతోనే నాట్లు వేసేస్తున్నారు. పైగా వీరు మూనకు 12 నాట్లను ఒక్కొక్కటిగా నాటడంతో వెన్ను భారీగా పెరిగి బాగా దుబ్బు చేస్తుందని రైతులంటున్నారు.
- బెంగాలీ కూలీల నాట్లు వేసే విధానంతో పంటకు తెగుళ్ల బెడద తగ్గడంతో పెట్టుబడులు కూడా ఆదా అవుతున్నాయని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బెంగాలీల నాట్లతో అదనపు దిగుబడి



నేను 13 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాను. ఐదేళ్లుగా వలస కూలీలతోనే నాట్లు వేయిస్తున్నాను. పెట్టుబడి, సమయం రెండూ కలసి వస్తున్నాయి. దీంతో పాటు వలస కూలీలు వేసిన నాట్ల వల్ల ఎకరానికి 5 నుంచి 6 బస్తాలు అధికంగా దిగుబడి వసుంది.

– మారిశెట్టి నరేష్, రైతు, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం మండలం

ఖర్చు తగ్గించుకునేందుకే..



ఏటికేడు సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. పైగా ఖరీఫ్ పనుల సమయంలో ఒక్కసారిగా డిమాండ్ ఏర్పడి స్థానికంగా కూలీలు దొరకడం కష్టమవుతుంది. పైగా స్థానిక కూలీలకు ఎక్కువ డబ్బులు ఇవ్వాల్సి వస్తుంది. అందుకే ఖర్చు తగ్గించుకునేందుకు వలస కూలీల వైపు మొగ్గు చూపిస్తున్నాం.

– సీహెచ్ కాటమరాజు, రైతు, దేవగుప్తం, అల్లవరం మండలం

వరద బాధితులను ఆదుకోవాలి

ముమ్మిడివరం: వరదల వల్ల నష్టపోయిన రైతులను, బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. వరద ప్రభావిత ప్రాంతాలైన లంకాఫ్ ఠానేల్లంక, కూనాలంక, గురజాపులంకల్లో సీపీఎం పార్టీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వరదల వల్ల రైతులు బెండ, అరటి, మునగ, టమాటా, పచ్చిమిర్చి, వంకాయ తదితర పంటలు నష్టపోయారన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్ట పరిహారం అందించాలని, మునిగిన ప్రతి ఇంటికి రూ.10 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.దుర్గాప్రసాద్, పాలమూరి శ్రీనివాసరావు, డి.రాఘవులు, వి.మోహనరావు, వి.రాంబాబు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' హామీపై దాటవేత ధోరణి

అమలాపురం టౌన్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన అమ్మ ఒడి పథకాన్ని కాపీ కొట్టి తల్లికి వందనం అనే పేరిట ఆర్థిక సాయం చేస్తామన్న ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ హామీ అమలుపై దాట వేత ధోరణిలో ఉందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మిండగుదటి శిరీష్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. శాసన మండలిలో మంత్రి నారా లోకేష్ ఈ పథకం అమలుపై మాట్లాడిన తీరు చూస్తుంటే పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకాన్ని పక్కాగా అమలు చేయడమే కాకుండా నాడు–నేడు పథకం ద్వారా విద్యాలయాలను అభివృద్ధి చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఉపాధ్యాయల భర్తీ కూడా వచ్చే సంవత్సరానికి పూర్తి చేస్తామని లోకేష్ ప్రకటించం గమనిస్తుంటే విద్యా పరంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ ఇప్పుడే అమలు చేసే పరిస్థితి కనిపించడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

నిలకడగా వరద



దరియాలతిప్పలో మునిగిన రైతుల భూములు



ముంపు బాధితులను అప్రమత్తం చేసేందుకు పడవపై వెళ్తున్న తహసీల్దార్ సునీల్‌కుమార్



పునరావాస కేంద్రంలో వరద బాధితులకు భోజనాలు వడ్డిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి

అల్లవరం: ఎగువ ప్రాంతాల నుంచి గోదావరి పరవళ్లు కొనసాగుతుండడంతో బోడసకుర్రు వద్ద వరద నిలకడగా కొనసాగుతుంది. రెండు రోజులుగా పల్లిపాలెంలోని మత్స్యకారుల ఇళ్లు వరద నీటిలోనే ఉన్నాయి. వరద ప్రభావానికి గురైన బాధిత కుటుంబాలకు స్థానిక ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో రెండు పూటలా భోజనాలు అందిస్తున్నారు. అధికారులు పడవలపై వెళ్లి పునరావాస కేంద్రానికి రాని బాధిత కుటుంబాలను పరామర్శిస్తూ అప్రమత్తం చేస్తున్నారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీఓ కృష్ణమోహన్, స్థానిక నాయకులు ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

ముంపులో దరియాలతిప్ప సొసైటీ భూములు

యానాం: గోదావరి వరదలకు స్థానిక దరియాలతిప్ప ఎస్సీ ఫీల్డ్ లేబర్ సొసైటీ భూములు మునిగిపోవడంతో తాము నష్టపోయామని గురువారం పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లంక భూముల్లో 191 మంది రైతులు సాగు చేసుకుంటూ జీవనోపాధి సాగిస్తున్నామన్నారు. అయితే వరదకు భూముల చుట్టూ ఉన్న రింగ్ బండ్ తెగిపోవడంతో వరద నీరు ప్రవేశించి తమ పొలాలు మునిగిపోయాయన్నారు. తమ భూముల చుట్టూ రింగ్ బండ్ వేయాలంటూ గతంలో ఎన్నోసార్లు ప్రభుత్వానికి వినతి పత్రాలు సమర్పించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గట్టును పటిష్ట పరచాలని కోరారు. కార్యక్రమంలో రైతులు కమిడి బాలయోగి, సబ్బతి శ్రీనివాసరావు, గిడ్ల వెంకన్న, దాసరి బుజ్జి పాల్గొన్నారు.

మల్లాడికి సత్కారం



మల్లాడి కృష్ణారావును సత్కరించిన ఎంటీఎస్ సిబ్బంది

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో డెయిలీ రేటెడ్ ప్రాతిపదికన విధులు నిర్వహించి ఇటీవలి ఎంటీఎస్ సెక్యూరిటీగా శాశ్వత ఉద్యోగులైన సిబ్బంది గురువారం ఢిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. పదోన్నతి పొందిన మొత్తం 29 మంది ఆయనను కలిసి దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రిగా ఉన్నప్పటి నుంచి తమ ఉద్యోగాల పర్మినెంట్ కోసం మల్లాడి కృష్ణారావు విశేష కృషి చేశారు కాబట్టే తమకు న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో పలువురు ఎంటీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తత అవసరం



డయేరియాపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

యానాం: ప్రస్తుత సీజన్‌లో డయేరియా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ వెంకటేశ్వర నాయక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక శారదా ప్రభుత్వ ఎయిడెడ్ హైస్కూల్‌లో యానాం మున్సిపాలిటీ, ఉమన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో స్టాఫ్ డయేరియా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యా శ్రీనివాస్, హెచ్ఎం చిక్కాల వెంకటేశ్వరరావు, మిషన్‌శక్తి సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు

కలెక్టర్ మహేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న చమురు సహజవాయుల సంస్థలు కార్పొరేట్ సామాజిక బాధ్యతతో గ్రామాల అభివృద్ధికి సహాయం అందించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ కోరారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో చమురు సహజ వాయువుల సంస్థ తూర్పు ప్రాంత ఆఫ్ షోర్ ఎసెట్ కాకినాడ ప్రతినిధులు, జిల్లా పంచాయతీ అధికారి, సీపీవోలతో సమావేశం నిర్వహించారు. ఓడల రేవు తదితర ప్రాంతాలలో మూడు క్లస్టర్ల ద్వారా నిర్వహిస్తున్న కార్యకలాపాలను ఓఎన్జీసీ ప్రతినిధులు కలెక్టర్‌కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఓఎన్జీసీ అధికారులు ముడిచమురు, గ్యాస్, నీటి విభజన విధానం, పైప్‌లైన్ భద్రత, గోదావరి బేసిన్‌లో చమురు సహజ వాయువులు డ్రిల్లింగ్ ద్వారా వెలికితీత, డ్రిల్లింగ్ సమయంలో చేపల వేట కోల్పోయిన మత్స్య కారులకు జీవనభృతి అందించడం, కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు కేటాయింపు తదితర అంశాలను విశదీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు చమురు, సహజవాయుల సంస్థ కార్యకలాపాలపై జిల్లా కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా పంచాయతీ అధికారి, ఓఎన్జీసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి సీఎస్ఆర్ నిధుల కేటాయింపుపై క్షుణ్ణంగా చర్చిస్తామని తెలిపారు. ఓఎన్జీసీ ఎస్టేట్ మేనేజరు కార్యనిర్వాహక సంచాలకులు రత్నేష్‌కుమార్, సీజీఎం మెకానికల్ నిర్మల్‌కుమార్, హెడ్ హెచ్ఎస్ఈ మేనేజర్ భాస్కరరావు, హెచ్‌ఆర్ హెడ్ సునీల్‌కుమార్, ప్రొడక్షన్ జనరల్ మేనేజర్ ఏ గుప్తా పాల్గొన్నారు.

కామనగరువులో ఆధార్ శిబిరం



ఆధార్ శిబిరాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ అరుణకుమారి

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువు గ్రామ సచివాలయం-2లో గురువారం ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపును సర్పంచ్ నక్కా అరుణ కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఈ ఆధార్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి పి.ఆదినారాయణ, సచివాలయ కార్యదర్శి సూరిబాబు, చొల్లంగి శ్రీను పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ మత్స్యకారుడి మృతి

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామానికి చెందిన పొన్నాడ పెంటారావు(33) వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ మృతి చెందినట్లు కోరంగి ఎస్ఐ ఎస్.రవికుమార్ తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల మేరకు పెంటారావు రోజూ మాదిరిగానే గ్రామ శివారు మొండి దిబ్బ వద్దకు వేటకు వెళ్లాడు. అక్కడ చేపల కోసం వేసిన వలలో ప్రమాదవశాత్తూ పడి చిక్కుకుపోయాడు. అది గమనించిన తోటి మత్స్యకారులు అతన్ని పైకి లాగి వల నుంచి తప్పించి బయటకు తీశారు. స్పృహ తప్పిపోవడంతో అతడిని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్ష చేయించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, ఐదేళ్ల కుమారుడు, మూడేళ్ల కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

బాధితులకు వితరణ

ఉప్పలగుప్తం: ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన మునిపల్లి కోటిగట్టు ప్రాంతానికి చెందిన తిరుకోటి సురేష్ కుటుంబీకులకు వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు గురువారం నిత్యావసరాలను, దుస్తులను అందించారు. అదే విధంగా జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ బాధితులకు నిత్యావసర వస్తువులను సమకూర్చారు.

ఆగస్టు 2న బడ్జెట్ సమర్పణ

యానాం: పుదుచ్చేరి 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను వచ్చే నెల 2న అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నట్లు స్పీకర్ సెల్వం గురువారం విలేకరులకు తెలిపారు. ఆర్థిక శాఖను సైతం నిర్వహిస్తున్న సీఎం రంగసామి రూ.12,700 కోట్లతో పూర్తి స్థాయి బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెడతారన్నారు.

వసతి గృహంలో ఆకస్మిక తనిఖీ



కాట్రేనికోనలో బీసీ వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ జ్యోతిలక్ష్మి

కాట్రేనికోన: స్థానిక బీసీ సంక్షేమ వసతి గృహాన్ని జిల్లా సంక్షేమ శాఖ అధికారి, బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ జ్యోతి లక్ష్మి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వసతి గృహాల్లో కనీస వసతులు లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై హాస్టల్‌కు రాం.. రాం.. శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ఈ నెల 15న ప్రచురితమైన కథనంపై డీడీ స్పందించారు. నాణ్యత లేని భోజనం, అపరిశుభ్రతతో ఉన్న మరుగుదొడ్లు, రక్షిత మంచి నీరు లేకపోవడం, ఫ్యాన్లు లేకపోవడం, కిటికీలకు తలుపులు లేకపోవడం తదితర ఇబ్బందుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో 11 మంది విద్యార్థులు మాత్రమే ఉండటంతో అడ్మిషన్లు ఎందుకు చేయలేదని వార్డెన్‌ను ప్రశ్నించారు. వసతి గృహంలో కనీస వసతులు కల్పించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

యానాం–పుదుచ్చేరి బస్సు నడపాలి

యానాం: కేంద్రపాలిత ప్రాంతం యానాం నుంచి పుదుచ్చేరి వరకూ వారానికి రెండుసార్లు పుదుచ్చేరి రోడ్డు ట్రాన్స్‌పోర్టు(పీఆర్టీసీ) బస్సులు నడపాలని కోరుతూ గురువారం స్థానిక యువకులు, విద్యార్థులు పీఆర్టీసీ జనరల్ మేనేజర్, ఆర్‌పీఓ మునిస్వామిని కలిసి కోరారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, జిప్‌మెర్, ఇందిరాగాంధీ మెడికల్ కళాశాల, మనకులార్ వినాయగర్ మెడికల్ కళాశాల, మహాత్మాగాంధీ మెడికల్ కళాశాల, వెటర్నరీ, నర్సింగ్, పుదుచ్చేరి యూనివర్సిటీల్లో చదువుకుంటున్న ఎంతో మంది యానాం విద్యార్థులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పుదుచ్చేరి–కారైకల్, పుదుచ్చేరి–మాహే, పుదుచ్చేరి–తిరుపతి బస్సులు నడుస్తున్నాయన్నారు. యానాంకు సైతం బస్సులు నడిపేలా చూడాలని వారు కోరారు.

రమణారావుకు పరామర్శ



గోపవరంలో సత్యవతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఉప్పలగుప్తం: మాతృ వియోగంతో బాధపడుతున్న మండలంలోని గోపవరానికి చెందిన వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు ఓగూరి విజయ్‌కుమార్‌ను గురువారం పలువురు నాయకులు పరామర్శించారు. విజయ్‌కుమార్ తల్లి సత్యవతి ఇటీవల మృతి చెందారు. సత్యవతి చిత్రపటానికి అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు గుడ్‌సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు, భీమనపల్లి సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో నేలపూడి సుగంధకుమార్, బడుగు శ్రీను, బీర బాలరాజు, కోటుం లోవరాజు, నల్లా సూర్యప్రకాష్, కుంచే బాబులు, కోరుకొండ కిరణ్ తదితరులున్నారు.

అర్హులైన అంగన్‌వాడీలకు పదోన్నతులు ఇవ్వాలి

అమలాపురం టౌన్: అర్హులైన అంగన్‌వాడీ వర్కర్లకు పదోన్నతులు కల్పించాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి డిమాండ్ చేశారు. స్థానిక నల్ల వంతెన సమీపంలో గురువారం జరిగిన అమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ఇవ్వాల్సిన కందిపప్పు నాలుగైదు నెలలగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బలరామ్, ప్రాజెక్ట్ యూనియన్ అధ్యక్షురాలు కె.విజయలక్ష్మి, అమూల్య, చంద్రకళ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా దర్శనమిచ్చిన పోలిమల్లమ్మ



సుబ్బాలమ్మను శాకంబరిగా అలంకరించిన కూరగాయల వర్తక సంఘం సభ్యులు

తాళ్లరేవు: మండల పరిధిలోని ఉప్పంగల గ్రామదేవత పోలిమల్లమ్మ అమ్మవారు గురువారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పవిత్ర ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని పండ్లు, కాయగూరలు, ఆకుకూరలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శాఖ శంకరుడు, దవులూరి శ్రీరామ్మూర్తి, నల్లా శ్రీనివాస్, పైడికొండల సూరిబాబు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా సుబ్బాలమ్మ

అమలాపురం టౌన్: పట్టణ దేవత సుబ్బాలమ్మ ఆలయంలో అమ్మవారు శాంకబరీదేవిగా గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక గణపతి కూరగాయల వర్తక సంఘం సమకూర్చిన వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా కూరగాయల వర్తక సంఘం సభ్యులు అమ్మవారికి పానకం, చలివిడి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గరగ నృత్యాలు, డప్పులు, వాయిద్యాలతో అమ్మవారిని ఊరేగించారు.